# పార్క్‌లోని సమస్యలను పరిష్కరించాలి

■ భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 18 : జిల్లా కేంద్రంలోని జయశంకర్ పార్క్‌లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి సుభాష్‌కాలనీలోని జయశంకర్ పార్క్‌ను సోమవారం ఆయన సందర్శించారు. పార్క్‌లోని వసతులను పరిశీలించి, పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు జీతాలు త్వరగా ఇవ్వాలన్నారు. పార్క్‌లో లైట్లు, ముందు భాగంలో సీసీ కెమెరాలు అమర్చాలని సింగరేణి అధికారులకు సూచించారు. పార్క్‌లో పనిచేసే కార్మికులకు డబుల్ బెడ్రూం ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్క్‌లో పాడైన ఆట వస్తుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముంజాల రవీందర్ గౌడ్, దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చల్లూరి సమ్మయ్య, సాంబమూర్తి, దేవన్న, బట్టు కరుణాకర్, ఆకుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

### ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కృష్ణకాలనీ : ఎన్నో ఏండ్లుగా ఆటోలు నడపుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో డ్రైవర్లు, ఓనర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలవేణి అశోక్ కుమార్ యాదవ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఎవరూ ఆటోలు ఎక్కడం లేదని, తద్వారా తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ జీవనోపాధి కింద ప్రతినెలా రూ. 15 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సామల రవి, ఆటో డ్రైవర్లు, ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గణపురం : మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు ఒద్దుల విజయా అశోక్‌రెడ్డి, మాదం మమతా సుధాకర్, బాబురావు, ప్రణయ్, మేడిపెల్లి రాజు, వీరమల్ల సంపత్ రెడ్డి, కుమారస్వామి, రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

**భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా**

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 18 : ప్రజావాణి వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు అందిస్తున్న ఉచిత ప్రయాణంలో సవరణలు చేయాలని, ధనవంతులు, ఉద్యోగాలు చేస్తున్న వారిని మినహాయించాలని, తెల్లరేషన్ కార్డు కలిగిన పేద మహిళలకు మాత్రమే అనుమతించాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారం కోసం 41 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిష్కరించిన వాటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఒకవేళ దరఖాస్తులు తిరస్కరణకు గురైతే పూర్తి వివరాలను సంబంధిత వ్యక్తికి తెలపాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన అధికారులు

కాటారం, డిసెంబర్ 18 : మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును భూపాలపల్లి జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, ఎల్లప్పుడు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాలోతు శంకర్, ఎంపీడీవోలు రవీంద్రనాథ్, చల్లా ప్రకాశ్ తదితరులున్నారు.

## నేడు మొగుళ్లపల్లి మండల సభ

మొగుళ్లపల్లి, డిసెంబర్ 18 : మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణవేణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు సమగ్ర నివేదికలతో రావాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరై సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

## తూకంలో తేడాలుంటే చర్యలు

కాటారం, డిసెంబర్ 18 : ఎలక్ట్రానిక్ కాంటాలను సక్రమంగా వినియోగించాలని, తూకంలో తేడాలుంటే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. మండలంలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో వే బ్రిడ్జి తూకంలో వ్యత్యాసం ఉందని కొందరు రైతులు చేసిన ఫిర్యాదుతో జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం తనిఖీ చేశారు. పలువురు రైతుల సమక్షంలో ఏఎంసీ కార్యదర్శి షరీఫ్‌తో కలిసి పలుమార్లు వే బ్రిడ్జిపై తూకం వేయించారు. తూకంలో ఎలాంటి వ్యత్యాసం రాలేదని శ్రీలత వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకంలో ఎలాంటి తేడాలు ఉండొద్దని యంత్రాలు, తూకాలను తనిఖీ చేసి స్టాంపింగ్ వేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట లీగల్ మెట్రాలజీ సిబ్బంది ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

మహదేవపూర్, డిసెంబర్ 18 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ సముద్రాల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఐదేండ్ల లోపు చిన్నారులకు న్యూమోనియా, అస్తమా లక్షణాలతో పాటు ఆక్సిజన్ స్థాయిలను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు కనకదుర్గ, శ్రీలత, శైలజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయ్ కుమార్

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మల్హార్, డిసెంబర్ 18 : మండలంలోని తాడిచర్ల వెలమలపల్లెలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ చెప్యాల రామారావు సోమవారం ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడకుండా నాణ్యత కలిగి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ మల్క రాజేశ్వరావు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వరావు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రామారావు

## అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మహదేవపూర్, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి రాజనీతి శాస్త్రం అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జున్ను విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులు ఉండాలని, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం ఉంటే చాలన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను కళాశాలలో ఈ నెల 22లోగా సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

## కాళేశ్వరంలో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు

కాళేశ్వరం, డిసెంబర్ 18 : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామికి గోదావరి నీరు, పాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంరతం కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో మహేశ్, ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, రాంరెడ్డి, శ్యామ్ సుందర్, ఎంపీటీసీ మమత తదితరులు పాల్గొన్నారు.

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : మండల కేంద్రంలోని నాగేంద్రగిరి అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు ఆలయ చైర్మన్ పడకంటి రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, అర్చనలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# రేగొండ ఎంపీపీపై అవిశ్వాస పరీక్ష వాయిదా

■ ఎంపీటీసీలతో కలెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని రేగొండ ఎంపీపీ పున్నం లక్ష్మిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస పరీక్ష వాయిదా పడింది. అవిశ్వాస పరీక్షకు ఎంపీటీసీలు హాజరయ్యేందుకు రాగా, చివరి క్షణంలో అధికారులు వాయిదా వేశారు. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలకు ప్రస్తుతం 13 మంది బీఆర్ఎస్‌లో, నలుగురు కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. అయితే, బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎంపీపీ పున్నం లక్ష్మి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆమెపై బీఆర్ఎస్ ఎంపీటీసీలు గత నెల 28న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ ఆర్డీవో రమాదేవికి లేఖను సమర్పించారు. దీంతో అవిశ్వాస పరీక్షకు సోమవారం వరకు ఆర్డీవో గడువు ఇస్తూ ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎంపీటీసీలు క్యాంపునకు వెళ్లారు. ఆర్డీవో ఇచ్చిన తేదీ ప్రకారం సోమవారం అవిశ్వాస పరీక్షకు హాజరయ్యేందుకు రేగొండకు రాగా ఎంపీడీవో సురేందర్ అవిశ్వాస పరీక్ష వాయిదా పడిందని ఎంపీటీసీలకు తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా చివరి సమయంలో ఎలా వాయిదా వేస్తారని సభ్యులు ప్రశ్నించగా ఆర్డీవో రమాదేవికి లోకాయుక్తలో కేసు ఉన్నందున వెళ్లిపోయారని, ఉదయం 4:30 గంటలకు లేఖను డిప్యూటీ తహసీల్దార్ రజాక్‌తో పంపించారని, వాటిని అందుబాటులో ఉన్న ఎంపీటీసీలకు అందించామన్నారు. మిగిలిన వారికి కార్యదర్శుల ద్వారా ఇంటి వద్ద అతికించినట్లు ఎంపీడీవో తెలిపారు. దీంతో విషయాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతికి ఎంపీటీసీలు తెలిపారు. గండ్ర జ్యోతి వారిని తీసుకుని కలెక్టర్ భవేశ్‌మిశ్రాను కలిశారు. ముందస్తు సమాచారం లేకుండా చివరి సమయంలో అవిశ్వాస పరీక్షను ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. ఆర్డీవోకు హఠాత్తుగా లోకాయుక్త కేసు ఉన్నందున వాయిదా వేయాల్సి వచ్చిందని, త్వరలోనే మళ్లీ అవిశ్వాస పరీక్షకు తేదీ నిర్ణయిస్తామని కలెక్టర్ తెలిపారు. వెంటనే అవిశ్వాస పరీక్షకు తేదీని ప్రకటించాలని గండ్ర జ్యోతి కోరారు.



అవిశ్వాసాన్ని వాయిదా వేయడంపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న గండ్ర జ్యోతి, సభ్యులు